నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, ఆదివారం 25 మే 2025 HYDERABAD




సీఎం ఇలాకాలో
## దాహం.. దాహం

కొడంగల్, మే 24 : దుద్యాల మండలంలోని ఆలేడ్‌వాసులు తాగు నీటి కోసం అల్లాడుతున్నారు. మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో గత నాలుగు రోజులుగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో ఇం ట్లోకే పుష్కలంగా నీళ్లు వచ్చేవని.. గత నాలుగు రోజులుగా ఖాళీ బిం దెలతో పొలాలకు పరుగులు తీయాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్య క్తం చేస్తున్నారు.




జీవో నెంబర్ 22ను వెంటనే సవరించి.. ఒకేషనల్ డెయిరీ విద్యార్థులకు వెటర్నరీ అసిస్టెంట్‌కు అర్హత ఇవ్వాలంటూ..పలువురు విద్యార్థులు శనివారం మాసబ్ ట్యాంక్ లోని పశుసంవర్ధక శాఖ భవన్ ముందు ఆందోళ న చేపట్టారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం పశు సంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ మల్లీశ్వరికి వినతి పత్రం అందజేశారు. - తెలుగు యూనివర్సిటీ

# మళ్లీ కొవిడ్ టెస్టులు!

సిటీబ్యూరో, మే 24 (నమస్తే తెలంగాణ)/బన్సీలాల్ పేట:

కరోనా కలకలంతో వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తం
లక్షణాలుంటే పరీక్షలు చేయించుకోండి
వైద్యాధికారుల సూచన
వైరస్ ప్రభావం కొంతే..
భయపడాల్సిన పనిలేదంటూ..అభయం
10 మంది వైద్యనిపుణులతో
గాంధీలో కొవిడ్ కమిటీ ఏర్పాటు

కరోనా కేసులు మరోసారి నమోదవుతుండడంతో వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ప్రస్తుతం వెలుగుచూస్తున్న కరోనా వేరియంట్ పెద్ద ప్రమాదకారి కాకపోయినప్పటికీ ముందు జాగ్రత చర్యగా అనుమానిత లక్షణాలుంటే పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇప్పటికే నగరంలో ఓ పాజిటివ్ కేసు నమోదవడంతో అనుమానితులకు పరీక్షలు జరిపేందుకు వైద్యాధికారులు చర్యలు చేపట్టారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నమోదైన కరోనా కేసును దృష్టిలో పెట్టుకుని జిల్లా పరిధిలో మల్కాజిగిరి ఏరియా హాస్పిటల్, జనరల్ హాస్పిటల్‌లో కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఉమాగౌరి తెలిపారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో ఇప్పటికే గాంధీ దవాఖానలో కరోనా పరీక్షలు జరుపుతుండగా, మరో 5 కొవిడ్ టెస్ట్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు జిల్లా, వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి తెలిపారు. ప్రస్తుతం జిల్లా పరిధిలో ఎలాంటి కరోనా కేసులు నమోదు కాలేదని, పరిస్థితులకు అను గుణంగా ఎప్పటికపప్పుడు అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. రంగారెడ్డి జిల్లా పరిధిలో కొండాపూర్ జిల్లా హాస్పిటల్‌తో పాటు వనస్థలిపురం ఏరియా హాస్పిటల్‌లో కరోనా పరీక్షలు అందుబాటులో ఉన్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఇప్పటివరకు జిల్లా పరిధిలో ఎలాంటి పాజిటివ్ కేసులు నమోదు కాలేదని, కేసుల ఆధారంగా కొవిడ్ టెస్ట్ కేంద్రాలను పెంచుతామన్నారు.

### అనుమానాస్పద లక్షణాలుంటే..

అక్కడక్కడ నమోదవుతున్న కరోనా కేసులతో భయపడాల్సిన పనిలేదంటున్నారు వైద్యనిపుణులు. అయితే వైరస్ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులపై కొంత ప్రభావం చూపే అవకాశమున్నందున ఆ రోగులు జాగ్రతలు పాటించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. అంతేకాకుండా కొవిడ్ అనుమానిత లక్షణాలున్నవారు ముందు జాగ్రత్త చర్యగా కరోనా పరీక్షలు చేయించుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ఎవరికైనా పాజిటివ్ అని నిర్ధారణ జరిగితే వెంటనే వారు స్వీయ ఐసొలేషన్ పాటిస్తూ వైద్యులు సూచించిన మందులు వాడాలని చెబుతున్నారు.

### కొవిడ్ కమిటీ ఏర్పాటు

కొవిడ్ కేసుల వ్యాప్తి నేపథ్యంలో గాంధీ దవాఖాన పాలన యంత్రాంగం అప్రమతంగా ఉన్నదని సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి అన్నారు. శనివారం జరిగిన సమావేశంలో కొవిడ్ కేసులను ఎదుర్కోవడానికి 10 మంది వైద్య నిపుణులతో ప్రత్యేక కొవిడ్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు.

మిగతా IVవ పేజీలో





గాంధీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కొవిడ్ వార్డు



# బదిలీ చేశారు.. భర్తీ మరిచారు

ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లో నర్సుల కొరత
రెండు వైద్యశాలల్లో 165 పోస్టులు ఖాళీగా ఉన్న వైనం
కొవిడ్‌ను ఎదురించాలంటే సరిపడా సిబ్బంది అవసరం

*రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు సుపరిచితమైన గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులల్లో సిబ్బంది కొరత వెంటాడుతున్నది. సరిపడా సహాయకులు లేక రోగులు నానా అవస్థలు పడుతున్నారు. కొవిడ్ హెచ్చరికలు చేస్తున్న తరుణంలో సరిపడా పడకలు సిద్ధం చేసినా కూడా సరిపడా సిబ్బంది లేకపోవడం గమనార్హం. 1168 పడకల సామర్థ్యం కలిగిన ఉస్మానియా ఆసుపత్రి, 1200 పడకలు కలిగిన గాంధీ ఆసుపత్రిలో ప్రస్తుతం 165 మంది నర్సుల కొరత ఉండటం గమనార్హం. ఇటీవల జరిగిన బదిలీల్లో ఈ ఆసుపత్రుల నుంచి ఇతర జిల్లాలకు బదిలీలో వెళ్లగా, వీరి స్థానాలను భర్తీ చేయలేదు. కొత్త పోస్టుల విషయంలో ప్రభుత్వం ప్రకటన జారీ చేసి భర్తీ చేయకపోవడంతో నర్సుల పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.*

- సిటీబ్యూరో, మే 24 (నమస్తే తెలంగాణ):




గాంధీ, ఉస్మానియా జనరల్ ఆసుపత్రులకు నిత్యం ఒక్కో ఆసుపత్రికి సుమారు 3000 మంది ఔట్ పేషెంట్లు వస్తుండగా, ఇన్‌పేషెంట్లు 1200 వరకు వస్తుంటారు. వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చే వారికి వైద్య సేవలందించడంతో నర్సుల పాత్ర ప్రముఖమైంది. రోగికి సహాయకరంగా ఉండటంతో పాటు, మందులు, చికిత్స తదితర సేవలందిస్తుంటారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఉస్మానియా ఆసుపత్రి నుంచి 110 మంది నర్సులు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం 193 మంది నర్సులు మాత్రమే రెగ్యులర్ వాళ్లు విధులు నిర్వహిస్తుండగా, మిగతా వాళ్లలో 60 మంది డిప్యూటేషన్‌పై వచ్చిన వారు, 41మంది టిమ్స్ నుంచి, 17 మంది పీసీఎస్‌పీ నుంచి వచ్చి తాత్కాలికంగా విధులు నిర్వర్తిస్తున్నారు. సికింద్రాబాద్‌లోని గాంధీ జనరల్ ఆసుపత్రిలో 400 మంది నర్సులు అవసరముండగా, వీరిలో 55 మంది ఇటీవల జరిగిన బదిలీల్లో ఇతర జిల్లాలకు వెళ్లారు. ప్రస్తుతం 242 మంది రెగ్యులర్ నర్సులు, డిప్యూటేషన్‌పై 30 మంది, ఒప్పంద ప్రాతిపదికన 130 మంది సేవలందిస్తున్నారు. డిప్యూటేషన్ మీద వచ్చిన నర్సులు తాత్కాలికంగా కొంత భారం తగ్గించినా అదే శాశ్వత పరిష్కారం కాదు కదా. మెరుగైన వైద్యసేవలందాలంటే రెగ్యులర్ నర్సుల భర్తీ అత్యంత అవసరం. కానీ ఉన్నసిబ్బందినంతా ఇతర జిల్లాలకు బదిలీ చేసి పెద్దాసుపత్రులుగా పేరొందిన వాటిలో సిబ్బంది కొరతను మిగిల్చింది. కనీసం కొత్త పోస్టులు భర్తీ చేయకుండా కాంగ్రెస్ సర్కారు చోద్యం చేస్తుండటం గమనార్హం.

### కొవిడ్‌ను ఎలా ఎదుర్కొంటారు?

ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ ప్రమాణాల ప్రకారం ఐసీయూలో 1:1 నిష్పత్తి ప్రకారం 1 రోగికి ఒక నర్సు, హైరిస్క్

మిగతా IVవ పేజీలో

# లెక్చరర్ల కొరత.. తగ్గుతున్న ఉత్తీర్ణత

సరైన బోధన లేక
పడిపోతున్న ఉత్తీర్ణత శాతం

సిటీబ్యూరో: గ్రేటర్‌లో ప్రభుత్వ ఇంటర్ కాలేజీల విద్యార్థులు అధ్యాపకుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొత్తం సిలబస్‌లో 40 శాతం కూడా తరగతులు జరగడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఫలితంగా వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత అవ్వడమే కత్తి మీద సాములా మారుతుందని తెలిపారు. ఈ ఏడాది వార్షిక పరీక్షల్లో ప్రభుత్వ ఇంటర్ కాలేజీల నుంచి 42,562 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, కేవలం 48 శాతం మాత్రమే విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అది కూడా అరకొర మార్కులతో పాసవ్వడం ఆందోళన కలిగిస్తున్నదని విద్యా నిపుణులు చెబుతున్నారు.



### మొత్తం 243 కాలేజీలు

గ్రేటర్ పరిధిలో మొత్తం 243 ప్రభుత్వ జూనియర్, ఒకేషనల్ కాలేజీలు నడుస్తున్నాయి. వీటి నిర్వహణ మాత్రం అధికారులు గాలికొదిలేశారు. ఫలితంగా సర్కార్ కాలేజీల్లో చదివే విద్యార్థులు విద్యలో వెనకంజలో ఉంటున్నారు. కాగా, ప్రైవేటు కాలేజీల్లో ఫీజులు ఫస్ట్ ఇయర్, సెకెండ్ ఇయర్ కలుపుకొని ఇతర ఖర్చులతో సుమారు రూ. 2-4లక్షల వరకు ఖర్చు అవుతుంది. అంత స్థోమత లేక తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు కాలేజీల్లో చేర్పిస్తున్నారు. కానీ సరిపడా లెక్చరర్లు లేక వారి భవిష్యత్ ప్రశ్నార్థకమవుతున్నది. పలు కాలేజీలో ఫస్ట్ లాంగ్వేజ్ ఇంగ్లిష్‌తో పాటు ఎకనామిక్స్, కామర్స్, ఫిజిక్స్, బాటనీ పాఠాలను బోధించే వారు లేరని విద్యార్థులు చెబుతున్నారు. ఒకేషనల్ కోర్సుల్లోనూ ఇదే దుస్థితి. ఏటా 40 శాతం వరకు కూడా క్లాస్‌లు జరగడం లేదు. విద్యా సంవత్సరం ప్రారంభమైన రెండు నెలల్లోపు ఖాళీలు ఉన్న చోట గెస్ట్ లెక్చరర్లను తీసుకుని బోధన ప్రక్రియను ప్రారంభించాల్సి ఉండగా ఆ దిశగా అడుగులు వేయడం లేదు. అక్టోబర్ మొదటి వారం వరకు కూడా నియామకాలు జరగకపోవడంతో బోధన అంతంత మాత్రంగానే సాగుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.



మిస్ వరల్డ్ పోటీల్లో మెరిసిన భారత్‌కు చెందిన అందాల రాశి నందిని గుప్తా

# 7 కిచెన్లు సీజ్

38 హాస్టళ్లకు షోకాజ్ నోటీసులు
జీహెచ్‌ఎంసీ టాస్క్‌ఫోర్స్ బృందాల స్పెషల్ డ్రైవ్

సిటీ బ్యూరో, మే 24(నమస్తే తెలంగాణ): నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న నగరంలోని పలు ప్రైవేట్ హాస్టళ్లలో జీహెచ్‌ఎంసీ టాస్క్ ఫోర్స్ బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు వివిధ విభాగాల అధికారులతో ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ బృందం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి నిబంధనలు ఉల్లంఘించిన హాస్టళ్లకు షోకాజు నోటీసులు ఇవ్వడంతో పాటు కిచెన్‌లు సీజ్ చేసి జరిమానాలు విధించారు. ఎల్బీనగర్ జోన్‌లోని శ్రీనగర్ కాలనీ, లలితనగర్, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతం, కూకట్‌పల్లి జోన్‌లోని కేపీహెచ్‌బీ, మూసాపేట్ ప్రాంతాలు, శేరిలింగంపల్లి జోన్‌లోని వినాయక్ నగర్, పత్రికా నగర్‌లలో ఈ డ్రైవ్ నిర్వహించారు. 60 హాస్టళ్లను తనిఖీ చేసి 38 హాస్టళ్ల యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. 7 హాస్టల్ కిచెన్లను మూసివేశారు. జీహెచ్‌ఎంసీ చట్టం, 1955 నిబంధనల ప్రకారం బృందాలు రూ.2,46,000 జరిమానా విధించారు. అదేవిధంగా శుక్రవారం 58 హాస్టళ్లను తనిఖీ చేసి 30 హాస్టళ్లకు నోటీసులు జారీ చేసి, 8 హాస్టల్ కిచెన్ లను సీజ్ చేశారు. అంతేకాకుండా సుమారు రూ.2.45 లక్షలు జరిమానా విధించారు. హాస్టల్ నిర్వాహకులు నిబంధనల ప్రకారం కాకుండా తమ ఇష్టానుసారంగా వ్యవహరించడంతో ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీంతో జీహెచ్‌ఎంసీ కమిషనర్ టాస్క్ ఫోర్స్ బృందాలతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశారు.



ఓ హాస్టల్ నిర్వాహకురాలికి షోకాజ్ నోటీసు అందజేసిన అధికారులు

## ఎలివేటెడ్‌పై 315 అభ్యంతరాలు

మేడ్చల్, మే 24(నమస్తే తెలంగాణ): ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట రింగ్ రోడ్డు వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్‌పై 315 అభ్యంతరాలు వచ్చాయి. 18 కిలోమీటర్ల మేరకు నిర్మించనున్న కారిడార్ నిర్మాణం మేడ్చల్-మల్కాజిగిరి, హైదరాబాద్ జిల్లాలో జరగనుంది. దీంతో రెండు జిల్లాలకు సంబంధించి వారు అభ్యంతరాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో కారిడార్ నిర్మాణ భూ సేకరణ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. కాగా, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా ఆస్తులు కోల్పోతున్న వారు అభ్యంతరాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో వారితో సమావేశాలు ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధమవుతున్నారు.

రూ.15 వేలు లంచం తీసుకుంటూ..
# ఏసీబీకి చిక్కిన ఎస్‌ఐ

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఎస్‌ఐ లంచం తీసుకుంటూ.. ఏసీబీకి చిక్కాడు. పాపిరెడ్డినగర్‌లో నివాసముండే కిరణ్ డీజే సౌండ్ సిస్టం నిర్వహిస్తాడు. మూడు నెలల కిందట అధిక శబ్దంతో డీజే నిర్వహిస్తుండగా పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. డీజే పరికరాలు సీజ్ చేశారు. ఈ కేసు నుంచి బయటపడాలని నిర్వాహకుడు అనేకసార్లు పోలీసులను కలిశాడు. ఆ కేసును పర్యవేక్షిస్తున్న ఎస్‌ఐ శంకర్ తనకు రూ.15 వేలు లంచం ఇస్తే సామగ్రి అప్పగిస్తానని చెప్పాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను సంప్రదించి..విషయం చెప్పాడు. కాగా, జగద్గిరిగుట్టకు చెందిన నాగేందర్‌కు డబ్బు ఇవ్వాలని ఎస్‌ఐ సూచించాడు. బాధితుడు శనివారం నాగేందర్‌కు డబ్బులు ఇస్తుండగా, అక్కడే ఉన్న ఏసీబీ అధికారులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా, ఎస్ శంకర్ సూచనతోనే తాను డబ్బులు తీసుకున్నట్లు వెల్లడించాడు. దీంతో వారిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులైన ఎస్సై శంకర్, మధ్యవర్తి నాగేందర్‌ను నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని ఏసీబీ సిటీ రేంజ్ యూనిట్ - 1 అధికారులు తెలిపారు.



పట్టుబడ్డ ఎస్‌ఐ శంకర్ (ఫైల్ )

## మరో రెండు రోజులు వర్ష సూచన

సిటీబ్యూరో: నగరంలో శనివారం పలు చోట్ల వర్షం కురిసింది. కూకట్‌పల్లిలో 2.53 సెం.మీలు, బోరబండలో 2.43, జీడిమెట్లలో 2.33, మాదాపూర్‌లో 2.30, జూబ్లీహిల్స్‌లో 2.23, గచ్చిబౌలి, ఖాజాగూడలో 2.0, హైదర్‌నగర్‌లో 1.93 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ద్రోణి ప్రభావంతో మరో రెండు రోజులు గ్రేటర్‌లో వర్షాలు కురుస్తాయన్నారు.



# సబ్ ప్లాన్లు వస్తేనే.. మాస్టర్ ప్లాన్

ఇంకా పెండింగ్‌లోనే
మాస్టర్ ప్లాన్- 2050 తుది ప్రక్రియ
సరుకు రవాణా, రవాణా సదుపాయాలతోపాటు,
ఆర్థిక మండళ్ల పేరిట ప్రత్యేక ప్రతిపాదన
ఇప్పటికీ ఆమోదించని రాష్ట్ర సర్కారు

సిటీబ్యూరో: హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్ - 2050 మరింత జాప్యం కానున్నది. 11 జిల్లాలకు విస్తరించిన హెచ్‌ఎండీఏలో ఏకరీతి పట్టణాభివృద్ధియే లక్ష్యంగా గత ప్రభుత్వం పలు మాస్టర్ ప్లాన్లను విలీనం చేసి ఒకే బృహత్ మాస్టర్ ప్లాన్ అమలు చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే ఆ ప్రణాళికలను కొంత మార్పు చేసి పరిధి విస్తరించడంతో పాటు, మాస్టర్ ప్లాన్ల విలీనం చేస్తూ మాస్టర్ ప్లాన్ - 2050 సన్నాహాలు చేసింది. కానీ ఇందులో రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలతో కొంత జాప్యం జరుగుతోంది. మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో భాగంగా రవాణా, సరుకు రవాణా, ఆర్థిక మండళ్ల అభివృద్ధియే లక్ష్యంగా బ్లూ, గ్రీన్ మాలిక వసతులతో కూడిన సమగ్రమైన మాస్టర్ ప్లాన్ ఉండాలని నిపుణులు, ప్రభుత్వం సూచించింది. దీనికి అనుగుణంగానే హెచ్‌ఎండీఏ సబ్ ప్లాన్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర సర్కారుకు అందించినా... ఇప్పటికీ ఆమోదం తెలుపలేదు. వీటికి ఆమోదం తెలిపితే గానీ మాస్టర్ ప్లాన్ రూపకల్పన మొదలయ్యే పరిస్థితి లేదని తెలిసింది.

### ఒక్క అడుగు ముందుకు పడలేదు..

కాంగ్రెస్ సర్కారు అట్టహాసంగా ప్రకటించిన మాస్టర్ ప్లాన్ - 2050కి ఒక్క అడుగు ముందుకు పడలేదు. క్షేత్ర స్థాయిలో ఎదురైతున్న ఇబ్బందులు, ప్రభుత్వంలో జరుగుతున్న జాప్యం మాస్టర్ ప్లాన్ ప్రణాళికలను ఇప్పటికీ పట్టాలెక్కించలేదు. మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో కీలకమైన మూడు ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించకపోవడంతో.. ఆ అంశంలో ముందుకు సాగే పరిస్థితి లేకుండా పోయింది.

### సబ్ ప్లాన్లతో మాస్టర్ ప్లాన్..

మాస్టర్ ప్లాన్ - 2050లోనే ఇప్పటికే ఉన్న మాస్టర్ ప్లాన్‌లను సమీకృతం చేయనున్నారు. అదేవిధంగా నూతనంగా మరో మూడు సబ్ ప్లాన్లను కూడా ప్రధాన ప్రణాళికల్లో కలిపి వేయనున్నట్లుగా తెలిసింది. అయితే ప్రభుత్వం చేసిన సూచనలకు అనుగుణంగా హెచ్‌ఎండీఏ యంత్రాంగం మార్పులు, చేర్పులతో సబ్ ప్లాన్లను రూపొందించినా... ఇప్పటికీ వీటిపై ప్రభుత్వం సమీక్షించలేదు.

నిలోఫర్ సూపరింటెండెంట్‌గా
# విజయ్‌కుమార్ బాధ్యతలు

సిటీబ్యూరో: నిలోఫర్ దవాఖాన కొత్త సూపరింటెండెంట్‌గా డా. విజయ్‌కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. మొన్నటి వరకు సూపరింటెండెంట్‌గా పనిచేసిన డా.రవికుమార్‌పై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేయడంతో ఆ బాధ్యతలను డా.విజయ్‌కుమార్‌కు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. కాగా నిలోఫర్ దవాఖాన నూతన సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా డా.విజయ్ కుమార్ మాట్లాడుతూ ఎక్కువగా నిరుపేద రోగులు వచ్చే నిలోఫర్ దవాఖానలో మరిన్ని మెరుగైన వైద్యసేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.



సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయ్‌కుమార్